

బొజ్జు కొలాంగూడను సందర్శించిన అధికారులు 8లో►

బొజ్జు కొలాంగూడలో తాగునీటి కష్టాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు స్పందించారు.



ఆటాడేదెలా.. 9లో►

గత ప్రభుత్వం అన్ని జీపీల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను నిర్మించింది. నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ప్రస్తుతం క్రీడాసామగ్రి జీపీల్లో మూలనపడ్డాయి.

గరిష్టం/కనిష్టం 34.0/22.0

వాతావరణం

పలు చోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్

కైలాస్‌నగర్: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలిసిన ఆయన బోథ్ నియోజకవర్గంలోని రోడ్లు, చెరువుల పెండింగ్ పనులపై చర్చించారు. ఇచ్చోడ–సోనాల మార్గంలోని ఆడేగామా (బి), పిప్రి గ్రామంలోని రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. అడెగామ (బి) లెఫ్ట్, రైట్ కాలువల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లుగా ఎమ్మెల్యే తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



హస్తకళా ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే హస్తకళా ప్రదర్శనలు దోహద పడతాయని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ మరాఠీ మీడియం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన హస్తకళా ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు హస్తకళా ప్రదర్శనలోనూ రాణించాలని సూచించారు. ఉపాధ్యాయురాలు కవిత ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో జయశీల, ప్రధానోపాధ్యాయులు దేవిదాస్, విజయలక్ష్మి, కవిత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'దశలవారీగా పోరాటాలు చేస్తాం'

ఆదిలాబాద్‌టౌన్: డీఈవో వైఖరికి నిరసనగా దశల వారీగా పోరాటాలు చేస్తామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎస్‌వో నియామకంలో డీఈవో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నోటిఫికేషన్‌కు భిన్నంగా అర్హత లేని ఓ ఉపాధ్యాయుడిని ఏఎస్‌వోగా నియమించడం సరికాదన్నారు. అక్రమాలను సవరించుకొని నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన వ్యక్తిని నియమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మార్చి 1న డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, అలాగే 5న పికెటింగ్, 6 నుంచి దీక్షలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.స్వామి, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, ఉపాధ్యక్షుడు టి.సూర్యకుమార్, కోశాధికారి కె.కిష్టన్న, కార్యదర్శులు కె.శ్రీనివాస్, కె.గణేష్, శివన్న, సి.విలాస్, గౌస్ మోయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



2కే రన్‌లో పాల్గొన్న బ్యాంకర్లు, యువత

కైలాస్‌నగర్: ప్రస్తుతకాలంలో బ్యాంక్ సేవలు ఎంత వేగంగా అందుబాటులోకి వచ్చాయో అంతే వేగంగా ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ భాస్కర్‌ప్రసాద్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 2కే రన్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన ఈ పరుగును జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రమేశ్‌రాథోడ్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పెరుగుతున్న సాంకేతికతతో పాటు మోసాలు కూడా పెరుగుతున్నాయన్నారు. బ్యాంకు నుంచి ఎలాంటి మెసేజ్ వచ్చినా వెంటనే సంబంధిత బ్యాంకుకు వెళ్లి వాటిని సరి చూసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులకు ఎలాంటి ఓటీపీ, ఇతరత్రా వివరాలు వెల్లడించవద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో రవీందర్ కుమార్



విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

జిల్లా వ్యాప్తంగా..
మొత్తం పరీక్ష కేంద్రాలు: 30
ఫస్టియర్ విద్యార్థులు: 11,666
సెకండియర్ విద్యార్థులు:9,861
స్క్వాడ్ : సిట్టింగ్ 2, ఫ్లయింగ్ 2

హెల్ప్ డెస్క్ : 08732-297115, సెల్ : 9848781808

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 19 వరకు కొనసాగనున్నాయి. ఇందుకోసం జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వైద్యసేవలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అయితే పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించమని స్పష్టం చేశారు. ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు యాజమాన్యాలు హాల్ టికెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావచ్చని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్‌డెస్క్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

సర్వం సిద్ధం..

పరీక్షల నిర్వహణ కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), 30 మంది డిపార్ట్‌మెంటల్ (డీవో) అధికారులు, ముగ్గురు కస్టోడియన్లు, 2 సిట్టింగ్‌స్క్వాడ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. వీరితో పాటు డీఈసీని నియమించారు. అలాగే హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ బృందాలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపట్టనున్నాయి. మాస్‌కాపీయింగ్ ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టనున్నారు.

జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు..

జిల్లావ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 2 సాంఘిక సంక్షేమ, 5 ట్రైబల్‌వెల్ఫేర్, తొమ్మిది ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఒక మోడల్ స్కూల్ ఉన్నాయి. మొత్తం 21,527మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 10,640, ఒకేషనల్ 1,026 మంది, అలా గే ద్వితీయ సంవత్సరం జనరల్ 8,824 మంది, ఒకేషనల్ 1,037 మంది పరీక్షలు రాయనున్నారు.

పూర్తిస్థాయిలో వసతులు..

పరీక్ష రాసే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రథమ చికిత్స కోసం సిబ్బందిని నియమించారు. గదుల్లో వెలుతురు, గాలి వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రశ్న పత్రాలను సీసీ కెమెరాల సమక్షంలో తెరవనున్నారు. పరీక్ష ముగిసిన తర్వాత సీసీ సమక్షంలోనే సీజ్ వేయనున్నారు.

వెబ్‌సైట్ నుంచి కూడా హాల్‌టికెట్లు..

ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే విద్యార్థులు వెబ్‌సైట్ tsbie. cgg. gov. in ద్వారా డౌన్‌లోడ్ చేసి పరీక్షలకు హాజరు కావచ్చని అధికారులు పేర్కొన్నారు. హాల్‌టికెట్లపై అటెస్టెడ్ అవసరం లేదని తెలిపారు. ఏవైనా ఇబ్బందులుంటే విద్యార్థులు హెల్ప్‌డెస్క్‌లో సమాచారం అందించాలని సూచించారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూస్తాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలి. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాం. ఏవైనా సందేహాలు ఉంటే డీఐఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలి. పరీక్షకు నిమిషం ఆలస్యం నిబంధన ఉంది. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి.

– రవీందర్‌కుమార్, డీఐఈవో

బీజేపీలో టికెట్ లొల్లి

- గోడం నగేశ్‌కు ఇస్తారనే ప్రచారం
- పార్టీలో చేరక ముందే ఎలా అని ప్రత్యర్థి వర్గం ప్రశ్న
- ఎంపీని ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారనే టాక్
- ఇక్కడే డ్రామా.. అమిత్‌షా దగ్గర నడవవంటున్న 'సోయం' వర్గం
- కమలం పార్టీలో ఆసక్తికర పరిణామాలు



సోయం బాపూరావు



గోడం నగేశ్

సాక్షి,ఆదిలాబాద్: కమలం పార్టీలో రెండు రోజులుగా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అవి ఎంతవరకు వాస్తవమనే విషయంలో పార్టీ ముఖ్య నేతలు స్పష్టతనివ్వడం లేదు. ప్రస్తుత ఎంపీ సోయం బాపూరావుకు టికెట్ కట్ అని.. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీ గోడం నగేశ్‌కు బీజేపీ నుంచి కన్ఫామ్ అనే ప్రచారం విస్తృతంగా సాగుతుంది. పార్టీలో చేరక ముందే ఎలా ఇస్తారని సోయం వర్గం ప్రశ్నిస్తోంది. మరో పక్క అదంతా ప్రచారమే.. తాను పార్టీ మారేది ఉంటే చెబుతానని గోడం నగేశ్, నాకు టికెట్ ఇవ్వరని పార్టీ పరంగా అధికారికంగా ఎవరైనా ప్రకటించారా అని సోయం బాపురావులు 'సాక్షి' వారిని పలకరించినప్పుడు పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారనే టాక్..

ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని బీజేపీ ఎమ్మెల్యేలు ఎంపీ సోయం బాపురావును వ్యతిరేకిస్తున్నారనే టాక్ విస్తృతంగా సాగుతుంది. సోయంను మార్చి వేరే వారికి టికెట్ ఇవ్వాలని వారు ప్రయత్నిస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఈ విషయంలో గత కొద్ది నెలలుగా ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేలు అన్నట్టుగా వ్యవహారం సాగుతుందని పార్టీలో చర్చ కూడా సాగుతుంది. దీంతోనే ఆయా ఎమ్మెల్యేలు తమ జిల్లా, నియోజకవర్గాల నుంచి పార్టీకి చెందిన, రాజకీయాలకు కొత్తగా వస్తున్న పలువురు ఆశావహులను ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం కూడా సాగింది. అందుకు తగ్గట్టే ఇప్పటికే ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పలువురు ఆశావహులు తమ ప్రచార రథాలను కూడా సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో తిప్పుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే బీఆర్‌ఎస్ నుంచి నగేశ్‌కు బోథ్ అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంతో బీజేపీలో చేరుతారనే ప్రచారం జరిగింది. అప్పట్లో ఈ చేరికను సోయం బాపూరావు అడ్డుకున్నారనే ప్రచారం కూడా విస్తృతంగా సాగింది. ఇదిలా ఉంటే అప్పుడు సిట్టింగ్ ఎంపీలు అందరూ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తారని పార్టీ స్పష్టం చేయడంతో సోయం బీజేపీ నుంచి బోథ్ బరిలో నిలిచారు. ఇటీవల జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. అయితే అంతకుముందు జనార్దన్‌తో పాటు నగేశ్ కూడా ఢిల్లీ వెళ్లి కమలం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేశారని,అధినేతలు హైదరాబాద్‌లోనే వారిని చేరాలని చెప్పడం, అక్కడ టికెట్‌పై స్పష్టత నివ్వకపోవడంతో నగేశ్ ఆసమయంలో పార్టీలో చేరలేదనే ప్రచారంసాగింది. తాజాగా మళ్లీ ఆయన చేరికపై, టికెట్ కాన్ఫమ్‌పై చర్చ మొదలైంది. ఇది ఎంతవరకు వాస్తవమో చూడాల్సిందే.

ఇక్కడే డ్రామా..

బీజేపీ టికెట్ నగేశ్‌కు ఇస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుండగా, మరోపక్క ఎంపీ సోయం బాపూరావు వర్గం దీన్ని ఖండిస్తుంది. పార్టీ నుంచి సోయం బాపూరావుకు అధికారికంగా టికెట్ ఇవ్వమని ఎక్కడా చెప్పలేదని వారంటున్నారు. ఇక్కడే డ్రామా నడుస్తుందని.. అమిత్‌షా దగ్గర ఇదంతా నడవదని వారు అంటుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా గొడం నగేశ్‌ను ఇటీవల పార్టీలో చేర్పించేందుకు ఢిల్లీకి వెళ్లి నిరాశతో వెనక్కి వచ్చిన సందర్భాన్ని వారు ఉటంకిస్తున్నారు. పరోక్షంగా ఈ ఎమ్మెల్యేలది ఢిల్లీలో నడవదన్నట్టుగా సోయం వర్గం ఎద్దేవా చేస్తుంది.

రేపటి జాబితాపై ఆసక్తి..

బీజేపీలో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి టికెట్ ఎవరికి ఇస్తారనే లొల్లి నడుస్తుండగా, గురువారం పార్టీ పరంగా దేశం మొత్తంగా తొలి జాబితా విడుదల కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రంలో సిట్టింగ్ ఎంపీల పేర్లు ఉంటాయని చెబుతున్నారు. మరోవైపు ఒక ఆదిలాబాద్ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టవచ్చనే ప్రచారం విస్తృతంగా సాగుతుంది. ఆ ప్రచారం ఇక్కడే జరుగుతుందా.. లేనిపక్షంలో అక్కడినుంచి సంకేతాలు ఉండడంతోనే ఇలాంటివి చర్చలోకి వస్తున్నాయా అనేది జాబితా ద్వారా స్పష్టమవుతుందని పలువురు అంటున్నారు.

ఇక ఉచిత విద్యుత్.. రూ.500కే సిలిండర్

- అమల్లోకి మరో రెండు గ్యారంటీలు
- తెల్లకార్డు ప్రామాణికంగా అమలు
- లబ్ధిదారుల ఎంపికపై కొరవడిన స్పష్టత

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రెండింటిని అమల్లోకి తెచ్చింది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచితంగా సరఫరా చేయనుండగా, రూ.500కే సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్లను అందజేయనుంది. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాలను ప్రారంభించారు. తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా వీటిని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ విడుదలైన మార్గదర్శకాల ప్రకారం చూస్తే జిల్లాలో ఎంత మందికి లబ్ధి చేకూరుతుందనే దానిపై స్పష్టత కరువైంది.

లబ్ధిదారులపై కరువైన స్పష్టత

జిల్లాలో 1,91,770 రేషన్ కార్డులుండగా అన్ని రకాలు కలిపి 2,15,884 వంట గ్యాస్ కనెక్షన్లున్నాయి. తెల్లకార్డు కలిగిఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న మహిళల పేరిట వంట గ్యాస్ కనెక్షన్ కలిగిన వారికే రూ.500కు సిలిండర్ అందజేస్తామని ప్రభుత్వ మార్గదర్శకాల్లో స్పష్టంచేసింది.దీంతో పాటు మూడేళ్లలో అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులు వినియోగించిన సిలిండర్ల సంఖ్యకనుగుణంగా వాటిని అందించాలని నిర్ణయించింది. అయితే ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల్లో వివరాలు తప్పుగా నమోదు చేశారంటూ 54,551 మంది వివరాలను జిల్లాకు పంపించింది. వారి వివరాలను పంచాయతీ కార్యదర్శులు సరి చేసి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇందులో ఎంత మంది లబ్ధిదారులుగా ఎంపికయ్యారనే దానిపై స్పష్టత లేదు. అలాగే జిల్లాలో వంట గ్యాస్‌కనెక్షన్లు మగవారి పేరిట ఉన్నాయి. మరి వారికి సబ్సిడి సిలిండర్ వర్తిస్తుందా.. లేదా అనే దానిపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత నివ్వలేదు. జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధిదారుల జాబితా అందలేదు. దీంతో ఎంతమందికి లబ్ధి చేకూరుతుందనేది సందిగ్ధంగా మారింది.

1.17 లక్షల మందికి గృహజ్యోతి

జిల్లాలో 1,58,202 గృహ వినియోగ కనెక్షన్లు ఉండగా 200 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే వారు 1,17,498 కుటుంబాలు ఉన్నట్లుగా విద్యుత్ శాఖ ప్రాథమికంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించింది. నిబంధనల ప్రకారం వీరందరికి ఈ నెల నుంచి జీరో బిల్లు రావాలి. కానీ వివరాల సేకరణ పూర్తి కాకపోవడంతో ఎంతమందికి ప్రయోజనం కలుగుతుందనేది వేచి చూడాలి. అద్దె ఇళ్లలో నివసించే వారు కూడా ఈ పథకానికి అర్హులుగా తేల్చింది. అర్హుల గుర్తింపు కోసం స్పాట్ బిల్లర్లు ఈ నెల ఆరు నుంచి 16వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి సంబంధించి రేషన్‌కార్డు,ఆధార్‌కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్ వంటి వివరాలు సేకరించారు. ఈ ప్రక్రియ పూర్తికాలేదు. అయితే ఈ నేపథ్యంలో ప్రభుత్వం 200 యూనిట్లను వినియోగించే వారికి జీరో బిల్లులను జారీ చేస్తామని ప్రకటించింది. దీన్ని ఏ లెక్కన అమలు చేస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. మిగిలిపోయిన వారి వివరాలు సేకరించి వారికి అమలు చేస్తారా లేదంటే ప్రభుత్వం ఇది వరకు వివరాలను సేకరించిన వారికి మాత్రమే అమలు చేస్తారా అనేది సందేహంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు లబ్ధి కలుగుతున్నప్పటికీ అర్హులైన వారందరికీ పూర్తిస్థాయిలో అందజేస్తారా లేదా అనేది అనుమానాలకు తావిస్తోంది.

కాంగ్రెస్ సంబరాలు..



ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌శ్రేణులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల్లోని మరో రెండు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజా సేవ భవన్‌లో ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లోని ప్రతి దాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అందులో భాగంగానే గృహజ్యోతి కింద రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్.. ఎస్

- లేఅవుట్ క్రమబద్ధీకరణ స్కీంకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- 14 వేల దరఖాస్తులకు మోక్షం
- సర్కారుకు ఇక భారీగా ఆదాయం
- మార్చి 31లోగా రుసుం చెల్లించాలి
- పాత నిబంధనల ప్రకారమే రెగ్యులరైజేషన్

పట్టణంలోని ఎల్ఆర్ఎస్ బ్లాక్‌లు	09
ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు	19,430
ఇప్పటి వరకు పరిశీలించిన దరఖాస్తులు	5211



ఎల్ఆర్ఎస్ ప్లాట్‌ను పరిశీలిస్తున్న బల్దియా సిబ్బంది

కైలాస్‌నగర్: లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్లను క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించింది. మార్చి 31లోపు పూర్తి రుసుం చెల్లించేందుకు గడువు విధించింది. ప్రభుత్వ నిర్ణయంతో మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 14వేల దరఖాస్తులకు మోక్షం కలుగనుంది. తద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగనుండగా సర్కారు ఖజానాకు రూ.కోట్ల ఆదాయం సమకూరే అవకాశముంది. అయితే దీ నిపై కొత్తగా ఎలాంటి మార్గదర్శకాలు ప్రకటించని ప్రభుత్వం 2020లో సూచించిన చార్జీల ప్రకారంగానే ప్లాట్లను క్రమబద్ధీకరణకు ఆదేశించింది.

పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

అనుమతిలేని లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లను రెగ్యులరైజ్ చేసేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను 2020లో ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా అదేఏడాది ఆగస్టు 31నుంచి అక్టోబర్ 31వరకు దరఖాస్తులను స్వీకరించారు. అక్రమ లేఅవుట్‌లు కలిగిన ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని ప్రాంతాన్ని బల్దియా అధికారులు ఎనిమిది బ్లాక్‌లుగావిభజించారు. ఆదిలాబాద్,ఖానాపూర్,అనుకుంట(కొంతభాగం), భుక్తాపూర్, రాంపూర్ (కొంతభాగం), మావల, బట్టిసావర్‌గాంవ్, కచికంటి వంటి ఎనిమిది బ్లాక్‌లుగా విభజించి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 19,430 దరఖాస్తుదారులు రూ.1000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని రెగ్యులరైజేషన్ చేయాల్సి ఉండగా రాష్ట్రస్థాయిలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియకు అప్పట్లో బ్రేక్ పడింది. తిరిగి రెండేళ్ల తర్వాత 2023 ఏప్రిల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రభుత్వ ఆదేశాలతో బల్దియా అధికారులు దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. 5,211 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి వివరాలను ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఇందులో కేవలం 60 మంది దరఖాస్తుదారులు మాత్రమే పూర్తి ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. వీటి ద్వారా బల్దియాకు దాదాపు రూ.20లక్షల వరకు ఆదాయం సమకూరినట్లుగా అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పెండింగ్‌లోని 14,219 దరఖాస్తులకు మోక్షం కలుగనుంది.

పాత నిబంధనల ప్రకారమే..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు ఆదేశించిన ప్రభుత్వం కొత్తగా ఎలాంటి మార్గదర్శకాలను విడుదల చేయలేదు. 2020లో అప్పటి ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారమే అక్రమప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు ఆదేశించింది. ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారించేందుకు పట్టణ ప్రణాళిక విభాగం సిద్ధమవుతుంది. ప్రతీ దరఖాస్తును టీపీఎస్, టీపీవో, ఏసీపీ పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు సంబంధించిన ప్లాట్లు బఫర్‌జోన్, చెరువులు, కుంటలు, రైల్వేలైన్, గ్రీన్ బెల్టు పరిధిలో ఉన్నాయా అనే దాన్ని పరిశీలించనున్నారు. నిబంధనల ప్రకారం ఉన్న ప్లాట్ల వివరాలను కమిషనర్ ఆమోదం కోసం పంపించనున్నారు. ప్లాట్ల కొలతలు, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్ ధరలు వంటి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఈ లెక్కన ఒక్కో దరఖాస్తుకు గంటకు పైగా సమయం పట్టే అవకాశముంటుంది. మార్చి 31లోగా పూర్తి చేయాలనే ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రక్రియ నిర్వహణ ప్రణాళికాధికారులకు కత్తిమీద సాములాగ మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. గ్రేడ్-1స్థాయి కలిగిన ఆదిలాద్ మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఎస్, టీపీవో మాత్రమే పనిచేస్తున్నారు. వీరు 14వేల దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిశీలించడం కష్టతరంగా మారనుంది.

ఖజానా ఇక గలగల

నిధుల కొరతతో సతమతమవుతున్న ఆదిలాబాద్ బల్దియాకు ఎల్ఆర్ఎస్ స్కీం కలిసి రానుంది. అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణతో బల్దియాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశముంది. దరఖాస్తులకు సంబంధించిన ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న మార్కెట్ విలువలో 14శాతం డబ్బులు వసూలు చేయనున్నందున బల్దియాకు రూ.కోట్లలో ఆదాయం సమకూరే అవకాశముంది. అలాగే అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన పేద, మధ్య తరగతి ప్రజలకు ఆటంకాలు తొలగిపోయి అధికారికంగా అనుమతులు అందనున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లుగా తెలిసింది. అయితే ఈ ప్రక్రియను ఎలా నిర్వహించాలనే దానిపై ఇప్పటిదాకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా చర్యలు చేపడుతాం. దరఖాస్తుదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలి. ప్లాట్ల పరిశీలనకు తాత్కాలిక సిబ్బందిని నియమించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– అనురాధ, టౌన్ ప్లానింగ్ అధికారి

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపట్టాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

కైలాస్‌నగర్: బోథ్ నియోజకవర్గ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా భవన్‌లో భారీ నీటిపారుదల శాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై ఆరా తీశారు. వాటి స్థితిగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి బ్యారేజ్ కింద భూములు కోల్పోయిన బాధితులకు తగిన పరిహారం అందేలా చూడాలన్నారు. వేసవి ప్రారంభమైనందున ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పులి సంచారం అవాస్తవం'

నేరడిగొండ(బోథ్): కుంటాల జలపాతం పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా వస్తున్న పుకార్లు అవాస్తవమని కుంటాల ఎఫ్‌బీవో సచిన్ తెలిపారు. ఇతర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్న వీడియోలను కొందరు సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేస్తున్నారని, ఇది అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. చుట్టుపక్క గ్రామాల ప్రజలు, పర్యాటకులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని సూచించారు.

ఏర్పాట్లు చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాలుగా కేటాయించిన గిరిజన పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఐటీడీఏ ఏటీడీవో నిహారిక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆమె చాంబర్‌లో ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రుచితకు గోల్డ్‌మెడల్


కోచ్‌తో నామాయి రుచిత

దిలావర్‌పూర్(నిర్మల్): మండల కేంద్రానికి చెందిన జాతీయ క్రీడాకారిణి నామాయి రుచిత అసోంలో జరిగిన ఖేలో ఇండియా 2024 యూనివర్సిటీ గేమ్స్‌లో 100 మీటర్ల హార్డిల్స్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్ఎస్ఎస్‌సీ బెంగళూరు శిక్షణా కేంద్రంలో కోచ్ రాబర్ట్ బాబీ జార్జ్ శిక్షణలో ఇప్పటికే పది జాతీయ పతకాలు సాధించింది.

బాలల సమస్యలు, పరిష్కారాలపై చర్చ

ఆదిలాబాద్‌రూరల్: గ్రామస్థాయి నుంచి బాలల హక్కుల పరిరక్షణ, బాలల సంబంధిత సమస్యల నిర్మూలనపై మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ డీఆర్‌డీఏ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మహిత స్వచ్ఛంద సంస్థ, యూనిసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు హాజరై క్షేత్రస్థాయిలో బాలల సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు. పాల్గొన్న వారిలో అంకోలి ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షయ్, సాయి చరణ్, మార్కండీ ఉన్నారు.

కలెక్టరేట్‌లో బైక్ చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బైక్ చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కలెక్టరేట్ ఆవరణలో పార్కింగ్ చేసిన బైక్‌ను నిందితులు చాకచక్యంగా అపహరించారు. విషయం సోషల్ మీడియాలో మంగళవారం చక్కర్లు కొట్టడంతో వెలుగులోకి వచ్చింది. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న మూట గణేశ్ తన బైక్ చోరీ జరిగిందంటూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ పురుషోత్తం తెలిపారు.

కప్పర్లలో పిచ్చికుక్క స్వైర విహారం

తాంసి(బోథ్): మండలంలోని కప్పర్లలో మంగళవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన కడదారపు పంచపూల, ఆశన్న,అంకుల సాయి, పోచ్చన్న, ఎర్రన్నపై దాడిచేసి గాయపర్చింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా పిచ్చికుక్కను గ్రామస్తులు కర్రలతో కొట్టి చంపారు.

ఆలోచనలు... ఆవిష్కరణలు

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో కాస్త వెనుకబడి ఉంటారనే భావనను ఈ విద్యార్థులు చెరిపివేశారు. విద్య, ఆలోచన పరంగా తాము ఎక్కడా తగ్గేది లేదంటూ తమ బుర్రకు పదును పెట్టారు. రోజువారీగా ఎదుర్కొనే సమస్యలను సైన్స్ పరంగా ఏ విధంగా అధిగమించవచ్చో చూపిస్తూ భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు సరికొత్త ఆవిష్కరణలను రూపొందించారు. జిల్లాకు చెందిన విద్యార్థులు మండల, జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రతిభ చూపారు. ప్రతిభ ఉంటే ఎక్కడైనా రాణించవచ్చని నిరూపించారు. భౌతిక శాస్త్రంలో సర్ సీవీరామన్ చేసిన విశేష సేవలకు గుర్తుగా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్‌డే నిర్వహించుకుంటున్నాం. నేడు జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులు రూపొందించిన పరికరాలు, వాటి ఆవశ్యకత, తదితర అంశాలతో ప్రత్యేక కథనం...

- సరికొత్త పరికరాలు రూపొందించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- నిత్యం ఎదుర్కొనే సమస్యలకు సైన్స్‌తో పరిష్కారాలు
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

పూల వ్యర్థాల వినియోగం...


రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న సుమిత్, ఈశ్వర్

పూల వ్యర్థాలను మనం ఎలా పడితే అలా పాడేస్తున్నాం. దీనివల్ల భూమి, నీటి, వాయు కాలుష్యం సంభవిస్తుంది. వీటిపై ఉండే కీటక నాశినులు, శిలీంద్ర నాశినుల వల్ల పర్యావరణానికి, మానవులకు చాలా ప్రమాదకరం. ఈ పూల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి వాడుకునే విధానాన్ని దిలావర్‌పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి చదువుతున్న సుమిత్, ఈశ్వర్ అనే విద్యార్థులు గైడ్ టీచర్ శ్రీ ప్రియ సహకారంతో ప్రాజెక్టును రూపొందించారు. పూల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి ధూప్ స్టిక్స్, అగర్‌బత్తీలు, సుగంధ ద్రవ్యాలు, మస్కిటో రీఫిల్లు, జీవ విచ్ఛిన్నం చెందే థర్మకోల్, వర్మికంపోస్ట్ తయారు చేశారు. ఈ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైంది.

సులువుగా పంటకు ఎరువులు వేసేలా...


తయారు చేసిన పరికరంతో కార్తీక్

తాంసి(బోథ్): రైతులు పంటలకు సులువుగా ఎరువులు అందించేందుకు తాంసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి జి.కార్తీక్ నాన్ స్టీచింగ్ యూరియా డిస్పోస్ యూనిట్ అనే పరికరాన్ని తయారు చేశాడు. గత జనవరిలో జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక మేళాలో భాగంగా వర్చువల్ మీటింగ్ ద్వారా ప్రదర్శనలు నిర్వహించగా కార్తీక్ తయారుచేసిన పరికరం రాష్ట్రస్థాయికి ఎంపికైంది. రైతులు ఎరువులు వేయడానికి సులువుగా ఉండటంతో పాటు దీనికి అమర్చిన మరో పరికరంతో పంటచేలలో సంచరించే విషపురుగులు సైతం దగ్గరి కి రాకుండా శబ్దం చేస్తుంది. కేవలం రూ.200 ఖర్చుతో మాత్రమే తయారయ్యే పరికరం ప్రతీ రైతు ఉపయోగిస్తే కూలీల కొరత సైతం అధిగమించే అవకాశం ఉంటుందని కార్తీక్ పేర్కొంటున్నాడు.

వాహన వేగాన్ని నియంత్రించే పరికరం


పరికరంతో మగ్గిడి అన్వేష్

రహదారుల్లో ప్రమాదాలు జరిగే చోట వేగ నియంత్రణ సూచికబోర్డులు పెట్టినా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు తగ్గించేందుకు ఖానాపూర్ మండలం మస్కాపూర్ పాఠశాలకు చెందిన మగ్గిడి అన్వేష్ గైడ్ టీచర్ జాడి శ్రీనివాస్ సహకారంతో వాహన వేగాన్ని నియంత్రించే ఆటోమేటిక్ స్పీడ్ కంట్రోలింగ్ మిషన్ రూపొందించాడు. పరికరాన్ని వాహన ఇంజన్‌కు అనుసంధానం చేస్తే ఆటోమేటిక్‌గా వాహన వేగాన్ని నియంత్రిస్తుంది. ఈ పరికరం జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

పంటల రక్షణకు పరికరం


షేక్ అవేజ్

పంటలను జంతువులు, అగ్ని ప్రమాదాల బారి నుంచి రక్షించేందుకు, నీటితడులు తగ్గితే ఆర్డునోయినో ఆధారిత సిస్టం ఉపయోగించి రక్షించుకునేందుకు సైన్స్ ఎగ్జిబిటును సోన్ మండలంలోని పాక్ పట్ల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న షేక్ అవేజ్ తయారు చేశాడు. ఉపాధ్యాయుడు జువ్వల శ్రీధర్ ఈ ప్రదర్శనకు గైడ్‌గా వ్యవహరించాడు. సిస్టంకు అనుసంధానించబడిన అలారం మోగడం వల్ల ఆ శబ్దానికి పశువులు భయపడి దూరంగా వెళ్లడం, అగ్ని, తేమకు సంబంధించిన నంబర్లు డిస్ప్లేలో నమోదై మొబైల్‌కు మెసేజ్, ఫోన్ వస్తుంది. దీంతో రైతులు అప్రమత్తం అవుతారు. ఈ ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

మోడ్రన్ రోడ్డు సైడ్ బారియర్స్


వేంపల్లి స్పందన

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణనష్టాలు సంభవిస్తుంటాయి. ఇలాంటి నష్టాలు జరగకుండా లోకేశ్వరం మండలంలోని పిప్రి ఉన్నత పాఠశాల విద్యార్థి వేంపల్లి స్పందనగైడ్ టీచర్ వేణుమాధవ్ సహకారంతో మోడ్రన్ రోడ్డు సైడ్ బారియర్స్ ప్రాజెక్టును రూపొందించింది. బారికేడ్లకు ఈ పరికరాన్ని ఉపయోగించడం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. ఈ విధానాన్ని ప్రస్తుతం విదేశాల్లో మాత్రమే ఉపయోగిస్తున్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ


పల్లవి

ఖానాపూర్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు ఇటీవల నిర్వహించిన మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ ప్రతి భ కనబర్చి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఆన్‌లైన్ విధానంలో బయోసైన్స్, ఫిజికల్ విభాగంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చారు. తాజాగా ఈ నెల 20న నిర్మల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఖానాపూర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి పల్లవి ప్రథమస్థానంలో నిలిచింది.

'ఉపాధి భద్రత కోసం ఉద్యమించాలి'


అభివాదం చేస్తున్న నాయకులు

భైంసాటౌన్(ముధోల్): బీడీ కార్మికులు ఉపాధి భద్రత కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎస్ భూమేశ్వర్ అధ్యక్షతన మంగళవారం పట్టణంలో స్వర్ణోత్సర సంవత్సర ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోప్టా చట్టం పేరుతో బీడి పరిశ్రమను దెబ్బతీస్తోందని, దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదముందన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని, లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బి.భూమన్న, ప్రధాన కార్యదర్శి బి.సూర్య శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నిర్మల్ జిల్లా కార్యదర్శి రాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు ఖాజా మొయినుద్దీన్, రాజేశ్, సుప్రియ, గంగాధర్, చిట్టక్క, డి.అరుణ ఐఎఫ్ టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు, వెంకట్ నారాయణ, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్, రాష్ట్ర కోశాధికారి మల్లన్న పాల్గొన్నారు.

'పార్టీలకు అతీతంగా ఏకతాటిపై నిలవాలి'


నినాదాలు చేస్తున్న ఆదివాసీ పర్ధాన్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మన ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు రాజకీయంగా గుర్తింపు లభించడంతో పాటు వివిధ నామినేటెడ్ పదవులలో అవకాశాలు రావాలంటే పార్టీలకు అతీతంగా ఐక్యతతో ఏకతాటిపై నిలవాలని ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ నాయకులు, హీరా సుక జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేష్, పూసం ఆనంద్‌రావ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు గుర్తింపు లేకపోవడంతో ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పర్ధాన్ సమాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి శంకర్, నాయకులు కుర్సేంగే యాదవ్‌రావ్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం జనార్దన్, ఆర్క శేషరావ్, తదితరులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో చోరీ

- మత్తుపదార్థం స్ప్రేచేసి రూ.60వేలు అపహరణ


బాధితుడు రాకూర్ అవినాశ్

భైంసారూరల్(ముధోల్): మండలంలోని మాటేగాం సమీపంలో సినీఫక్కీలో చోరీ జరిగింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... వానల్‌పాడ్ గ్రామానికి చెందిన రాకూర్ అవినాశ్ మంగళవారం భైంసాకు వచ్చి ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేశాడు. బైక్‌పై వానల్‌పాడ్ వెళ్తుండగా మాటేగాం సమీపంలో గుర్తు తెలియని మహిళ, పురుషుడు అవినాశ్ వాహనాన్ని ఆపి నిర్మల్‌కు ఎలా వెళ్లాలని అడిగారు. మాటల్లో పెట్టి అతని ముఖంపై మత్తుపదార్థం స్ప్రేచేయడంతో స్పృహ కోల్పోయాడు. అతని వద్ద ఉన్న రూ.60 వేలు అపహరించారు. కొద్ది సేపటికి తేరుకున్న అవినాశ్ తన వద్ద ఉన్న డబ్బులను దొంగిలించుకుపోయారని గుర్తించి భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి'


నివాళులర్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులపై హెచ్‌డబ్ల్యూవోలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా దళితాభివృద్ధి, బీసీ అభివృద్ధి శాఖ అధికారులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దళితాభివృద్ధి, బీసీ అభివృద్ధి శాఖ హెచ్‌డబ్ల్యూవోలతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా వారిని సన్నద్ధం చేయాలన్నారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆది లాబాద్ దళితాభివృద్ధి శాఖ అధికారి సునిత కుమారి, బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జు కొలాంగూడను సందర్శించిన అధికారులు


బోరును పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నార్నూర్: మండలంలోని భీంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బొజ్జు కొలాంగూడలో తాగునీటి కష్టాలపై మంగళవారం 'సాక్షి'లో 'చెరువునీరే దిక్కు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పందించారు. మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫోన్ ద్వారా గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి ఎలాగైనా తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీఈ శ్రీనివాస్, ఏఈ సుభానిని ఆదేశించారు. అధికారులు గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యకు గల కారణాలపై ఆరా తీశారు. తాగునీటి సౌకర్యానికి రూ.4 లక్షలు ఖర్చవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. 'సాక్షి' కథనంతో తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం రావడంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

- ట్రిపుల్‌ఐటీలో అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న న్యూరో సైకియాట్రిస్ట్ అల్లాడి సురేశ్‌కుమార్, హాజరైన విద్యార్థులు

భైంసా: మానసిక ఒత్తిడిని జయిస్తేనే విజయతీరాలకుచేరుతామని న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ అల్లాడి సురేశ్‌కుమార్ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ–1 విద్యార్థులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు టైం మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెట్టాలని సూచించారు. మొబైల్ ఫోన్ల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. తరచూ ఇతర అంశాలపై కాకుండా విద్యపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. తరచూ ఇతర విషయాలపై ఆలోచించకుండా చదువుపైనే దృష్టిపెట్టాలన్నారు. విజయతీరాలకు చేరే అంశాలపై దృష్టిసారించి అందుకు తగ్గట్లు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ పావని, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ దత్తు, చీఫ్ వార్డెన్ శ్రీధర్, అడిషనల్ చీఫ్ వార్డెన్ సుజాత, కౌన్సిలర్ నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, శివకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంద్రాదేవికి 'మెస్రం' మొక్కులు


ఇంద్రాదేవికి మొక్కుతున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఇంద్రాదేవి ఆలయంలో మెస్రం వంశీయులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కేస్లాపూర్ గ్రామానికి చెందిన మెస్రం వంశీయులతో పాటు గ్రామస్తులు వచ్చి ఇంద్రాదేవికి నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. మెస్రం వంశ పటేల్ వెంకట్‌రావ్ మాట్లాడుతూ, నాగోబా జాతర తరువాత ఇంద్రాదేవి ఆలయంలో మొక్కులు సమర్పించడం ఆనవాయితీ అని తెలిపారు. వంశ పెద్దలు బాదిరావ్, చిత్రు, గ్రామ పెద్దలు బారిక్‌రావ్, భీంరావ్, గణేశ్ పాల్గొన్నారు.

నాణ్యత నవ్వింది.. డివైడర్ పగిలింది




ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా గాంధీచౌక్‌లో చేపట్టిన డివైడర్ల నిర్మాణంలో నాణ్యత డొల్లతనం బయటపడింది. నిర్మించి ఏడాది కూడా కాకుండానే పూర్తిగా పగుళ్లుతేలి బండలు బయటపడుతున్నాయి. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బల్దియా ఇంజనీరింగ్ అధికారుల ధనదాహార్తికి సైతం ఈ డివైడర్ల నిర్మాణం మచ్చుతునకగా నిలుస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

తానూరు(ముధోల్): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రీకాంత్ (20) కొంతకాలంగా మద్యానికి బానిసై ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి మన్యాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహాగాంలో ఒకరు ...

భైంసారూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మహాగాంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాతు రాజేశ్ (32) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సృజనతో పాటు కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై...

లోకేశ్వరం(ముధోల్): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని హద్గాంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఇరగదిండ్ల పోశెట్టి (58) కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో దులానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య పీరవ్వ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.